
ఆంధ్రజ్యోతి
**
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
మంగళవారం 6 ఫిబ్రవరి 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.130	190	220
సూర్యాపేట	రూ.135	190	210
నల్లగొండ	రూ.130	190	215

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.5 । కనిష్ఠం 20.2

ఆర్తత్రాణపరాయణుడు, ఏకశిఖరవాసుడు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహుడి క్షేత్రంలో ఆర్జిత సేవల మొక్కులు చెల్లింపునకు భక్తులు నానాతంటాలు పడుతున్నారు. ఇష్టదైవం దర్శనాలతో పాటు మొక్కు ఆర్జితాల్లో కుటుంబసమేతంగా పాల్గొని నిర్వహిస్తే తమ కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ క్షేత్రంలో ఎంతో ప్రాశస్త్యం కలిగిన ఆర్జిత సేవల్లో పాల్గొనాలంటే భక్తులకు పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. ఏ సేవల కోసం ఎక్కడికి వెళ్లాలో తెలియక తికమక పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని మొక్కు సేవలు కొండ కింద ఉండటం, తీరా కొండపైకి వచ్చిన తర్వాత కొన్ని సేవలు నిర్వహించుకోలేమని తెలిసి భక్తులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

● యాదగిరిగుట్ట

నారసింహా.. నీ మొక్కు చెల్లించేదెలా?



ఉద్ఘాటనకు ముందు ఆలయ ప్రాంగణంలో సేదతీరిన భక్తులు(ఫైల్)

- అనాలోచిత నిర్ణయాలతో అష్టకష్టాలు
- తలానీలాల నుంచి మొక్కు టెంకాయ వరకు అంతా అసౌకర్యమే

యాదగిరికొండ పైకి చేరుకున్న యాత్రికులు ముందుగా తాము మొక్కుకున్న ఆర్జిత సేవలను ఆచరించి కుటుంబసభ్యులతో కలిసి గర్భాలయంలో కొలువుదీరిన స్వయంభువులను దర్శించుకుంటారు. ఆ తర్వాత స్వామివారి ప్రసాదాలు కొనుగోలు చేసి కుటుంబ సభ్యులకు, తోటి భక్తులకు పంపిణీ చేసుకోవడం ఆచారం. ఇదిలా ఉండగా ఏ వాహనంలోనైనా ముందుగా భక్తజనులు కొండపైకి చేరుకుంటారు. కాగా కొండపైకి వచ్చిన భక్తులు దేవస్థాన అధికారులు అనాలోచిత నిర్ణయాల కారణంగా ఆర్జిత సేవల నిర్వహణ కోసం కొండ పైకి, కిందకు తిరగాల్సి వస్తుండడం భక్తులను ఇబ్బందులకు గురిచేస్తోంది. తీరా కొండపైకి వచ్చిన తర్వాత కొన్ని సేవలు నిర్వహించుకోలేమని తెలిసి భక్తులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. మొక్కు టెంకాయ సమర్పణ ప్రహసనంగా మారగా మొక్కు కల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన హవన పూజల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ఇక తలనీలాల సమర్పణ, వ్రతపూజలు కొండకిందకు మార్చడంతో భక్తుల ఇక్కట్లు మరింత రెట్టింపు చేస్తుండగా..ఏకంగా ఆలయ పునర్నిర్మాణం తర్వాత కొండపైన మూడు నిద్రల మొక్కు, మండల దీక్ష మొక్కులకు మంగళం పాడినట్లేనా అని భక్తులు వాపోతున్నారు.

కల్యాణోత్సవ సేవకు తప్పని తిప్పలు

ప్రధానాలయ అష్టభుజి అంతర్ ప్రాకార మండపంలో నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన హోమం మొక్కుల నిర్వహణకు భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణ పరిస్థితులు మారిన సందర్భంలో ఈ సేవలను ప్రధానాలయ ముఖమండపం లేదా ఉత్తర దిశలోని మొదటి ప్రాకార మండపంలో నిర్వహిస్తున్నారు. దీంతో ఎప్పుడు వర్షం కురిసినా, వాతావరణం మబ్బులు పట్టి చల్లగా మారితే అధికారులే తలలు పట్టుకుంటున్నారు. ఆలయ విస్తరణ సమయంలో ఏకంగా 500 మంది దంపతులు స్వామివారి నిత్యకల్యాణోత్సవం నిర్వహించుకునేలా మండపాన్ని సకల సదుపాయాలతో నిర్మిస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. నిత్యకల్యాణం, హోమపూజల కోసం అష్టభుజి ఈశాన్య ప్రాకారంలో కల్యాణోత్సవ మండపాన్ని నిర్మించారు. తీరా ఉద్ఘాటన అనంతరం మాత్రం దక్షిణ దిశలో ప్రాకార మండపంలో ఈ సేవలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రాకార మండపం మూడు వైపులా తెరిచి ఉండడంతో సేవలో పాల్గొనే భక్తులు వానరాలతోనే సావాసం చేయాల్సిరావడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. చివరకు దేవస్థాన సిబ్బంది ప్రాకార మండపంలో ఈ సేవలు పూర్తయ్యే వరకు పహారా కాస్తుండడం విశేషం. ఇదిలా ఉండగా తాము చేసిన తప్పిదానికి దిద్దుబాటు చర్యగా ప్రస్తుతం బాలాలయం ప్రాంతంలో దాత సహకారంతో కల్యాణమండపం నిర్మాణానికి సన్నాహాలు ఆరంభించగా..ఆ పనులు ప్రణాళికలకే పరిమితమయ్యాయి.

ధ్వజస్తంభాన్ని చూసి తరించాల్సిందే

ఏ దేవాలయానికి వెళ్లినా ప్రతీ భక్తుడు తప్పనిసరిగా ధ్వజస్తంభానికి మొక్కుకుని గర్భగుడిలో కొలువుదీరిన మూలమూర్తులను దర్శించుకోవడం ఆనవాయితీ. ఆలయ విస్తరణకు ముందు కొండకు వచ్చిన ప్రతీ భక్తుడు ముఖ మండపంలోని ధ్వజస్తంభం, బలిపీఠాలకు మొక్కుతూ గర్భాలయంలోనికి వెళ్లేవారు. ఒకవేళ రద్దీ చాలా ఎక్కువగా ఉన్న సమయంలో ఆలయ బయటనుంచే కనిపించే ధ్వజస్తంభాన్ని, విమానగోపురం గల సుదర్శన చక్రానికి మొక్కుకుని మరోమారు యాత్రకు వస్తామంటూ తిరుగు ప్రయాణమయ్యేవారు. కానీ ఇప్పుడు పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ప్రధానాలయ ముఖమండపంలోనికి వెళ్లిన భక్తులకు మాత్రమే ధ్వజస్తంభాన్ని దర్శించుకోవాలే తప్ప దండం పెట్టుకునే అవకాశమే లేకుండా ఏర్పాట్లు ఉన్నాయి.

మొక్కు టెంకాయ సమర్పణ ఎక్కడ?

యాదగిరిగుట్టకు వచ్చిన భక్తులకు మొక్కు టెంకాయ సమర్పణ ప్రధాన సమస్యగా మారింది. భక్తులు స్వామి, అమ్మవార్లకు టెంకాయలు సమర్పించడం ఆచారం. అయితే విస్తరణ అనంతరం మొక్కు టెంకాయ సమర్పణ సేవను విష్ణుపుష్కరిణి వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్నారు. అయితే ఈ మార్గం గుండా ధర్మదర్శనాల భక్తులు వెళుతున్న వారికి టెంకాయ మొక్కు చెల్లించుకునేందుకు నానా



ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే వీఐపీ దర్శన టికెట్ పొందిన భక్తులు, నేరుగా ఆర్జిత సేవల్లో పాల్గొనేందుకు వచ్చిన భక్తులు మొక్కు టెంకాయ సమర్పణ కోసం వెతుకులాడాల్సి వస్తోంది. చివరకు గుడి పరిసరప్రాంతాల్లో కొందరు విడిచిపెట్టి వెళుతుండగా, తూర్పు రాజగోపురం ముందు టెంకాయలతో వచ్చిన భక్తుల నుంచి ఆలయంలోనికి అనుమతి లేదంటూ దేవస్థాన సిబ్బంది టెంకాయలను తీసుకుని ద్వారం వద్ద వదిలివేస్తున్నారు. దీంతో భక్తులు స్వామికి మొక్కుటెంకాయ సైతం సమర్పించుకునే భాగ్యం తమకు లేకుండా పోతుందని వాపోతున్నారు.

గుడి వద్దే టెంకాయ సమర్పణ ఉండాలి



కొండపైన గుడివద్దే మొక్కు టెంకాయలు సమర్పించుకునే విధంగా ఏర్పాట్లు ఉండాలి. చిన్నప్పటి నుంచి కుటుంబసమేతంగా గుట్టను సందర్శిస్తున్నా. పాతగుడి, బాలాలయంలోనూ దర్శనాలనంతరం గుడి కి సమీపంలోనే కొబ్బరికాయలు కొట్టేవాళ్లం. అదే పద్ధతి కొనసాగిస్తే అందరికి అనువుగా ఉంటుంది. ప్రస్తుతం టెంకాయ కొట్టడానికి తిరిగి బస్ స్టాండ్ వద్దకు రావాల్సివస్తోంది.

\- శైలజాప్రసాద్, భక్తురాలు, హైదరాబాద్

నిత్యకల్యాణ మండపం నిర్మించాలి



పూర్తిగా కృష్ణశిలలతో ఆలయాన్ని పునర్నిర్మించడం సంతోషకరమే. కానీ నిత్యకల్యాణోత్సవానికి ప్రత్యేకంగా కల్యాణమండపం నిర్మిస్తే బాగుండేది. స్వామివారి నిత్యకల్యాణోత్సవంలో ఎంతో భక్తి ప్రపత్తులు, శ్రద్ధతో కుటుంబసమేతంగా పాల్గొంటాం. ఇప్పుడున్న అష్టభుజి ప్రాకార మండపంలో ఎండకు ఎండుతూ, చలికి వణుకుతూ, కోతులకు భయపడుతూ కల్యాణోత్సవంలో పాల్గొనాల్సి వస్తోంది. అధికారులు గమనించి భక్తుల సౌకర్యంతో పాటు కల్యాణమూర్తుల వద్దకు కోతులు రాకుండా సరైన సదుపాయాలతో నిత్య కల్యాణం, హోమ పూజలు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

\- జీపీఆర్ లక్ష్మి, భక్తురాలు, సరూర్‌నగర్

ఆర్జితాలన్నీ కొండపైనే ఉండాలి

యాదగిరికొండకు కుటుంబసమేతంగా వచ్చి ఆర్జిత సేవల్లో పాల్గొని స్వామిని దర్శించుకుని వెళతాం. కొన్ని సేవలు కింద, కొన్ని సేవలు కొండపైన ఉండడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. చంటిపిల్లలు, వృద్ధులతో కలిసి సేవల్లో పాల్గొనాలంటే ఇటు, అటూ తిరగడంతోనే పుణ్యకాలం పూర్తవుతోంది. సకాలంలో పూజలకు చేరుకునేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అన్ని ఆర్జితాలు కొండపైనే ఉంటే ఇబ్బందులు పూర్తిగా తప్పుతాయి.

\- ఎన్ మౌనిక, భక్తురాలు, రామంతాపూర్

వ్రత పూజలు కొండకిందనా?

స్వామి సన్నిధిలో సత్యనారాయణస్వామి వ్రత పూజల నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నవరం తర్వాత అంతటి ప్రాశస్త్యం కలిగి ఉందని స్థల పురాణం చెబుతోంది. ఆలయ విస్తరణలో భాగంగా వ్రత మండపాన్ని కొండకింద మూడో ఘాట్‌రోడ్డు సమీపంలో నిర్మించారు. అయితే తమ ఇళ్ల నుంచి నేరుగా కొండపైకి చేరుకున్న భక్తులు వ్రత పూజలు చేపట్టేందుకు పిల్లాపాపలతో కొండకిందకు వెళ్లాల్సి రావడం భక్తులను ప్రయాసలకు గురిచేస్తోంది.



కొండపైన వ్రత పూజల్లో పాల్గొన్న భక్తజనులు(ఫైల్)

కలగా మూడు నిద్రల మొక్కు

స్వయంభూ పాంచనారసింహుడు వెలిసిన కొండపైనే మూడు నిద్రలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తులు విశ్వాసం. అలనాడు యాదరుషి కఠోరమైన తపస్సుతో స్వామిని సాక్షాత్కారం చేసుకున్నాడని, స్వామి సన్నిధిలో మూడు నిద్రలు చేస్తే యాదరుషి పొందిన ఫలితం కలుగుతుందని భక్తుల నమ్మకం. గతంలో భక్తులు కుటుంబసమేతంగా కొండపైనే వసతి గదులు లభించకున్నా.. ఆలయ తిరువీధుల్లోనే నిద్రచేసి మొక్కులు చెల్లించుకునేవారు. ప్రస్తుతం కొండపైన ఎలాంటి డార్మెటరీ హాల్స్ తదితర నిర్మాణాలు లేకపోవడంతో మూడు నిద్రల మొక్కు క్షేత్రానికి వచ్చిన భక్తులకు కలగానే మారింది.



కొండపైన వసతి గదుల సముదాయం (ఫైల్)

తల నీలాల మొక్కు తీరినట్టేనా!

స్వామివారి దర్శనాలకు విచ్చేసిన భక్తులు కొండ కింద మొక్కుతలనీలాలు సమర్పించాల్సి ఉంటుంది. దీంతో తమ మొక్కులు తీరినట్టేనా అన్న ఆందోళనలో ఉన్నారు. చేసేదేమీ లేకపోవడంతో మొక్కుబడిగా మొక్కుతలనీలాలను చెల్లించుకుంటున్నారు. మొక్కుతలనీలాలు తీసిన వెంటనే మహిమాన్విత విష్ణుపుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించే వారమని, ఇప్పుడు కొండకింద తలనీలాలు తీసి పక్కనే ఉన్న లక్ష్మీపుష్కరిణిలో స్నానాలు చేస్తున్నారు. మహిమాన్విత విష్ణుపుష్కరిణితో కృత్రిమంగా నిర్మాణం జరిపి లక్ష్మీపుష్కరిణిగా ఎలా పోల్చుకోగలమని భక్తులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.



కొండపైన తలనీలాలు సమర్పిస్తున్న భక్తజనులు(ఫైల్)

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటరావు

సూర్యాపేట(కలెక్టరేట్), ఫిబ్రవరి 5 : జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని కలెక్టర్ ఎస్ వెంకటరావు అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి సందర్భంగా అదనపు కలెక్టర్లు సీహెచ్. ప్రియాంక, వెంకటరెడ్డి తో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం నియోజకవర్గానికి రూ.10 కోట్లు మంజూరు చేసిందని, అత్యవసర పనులకు రూ.కోటి వరకు వినియోగించడానికి వీలుందన్నారు. ఉపాధి పథకం కింద చేపట్టిన పనులు ఈ నెల 29వ తేదీలోగా పూర్తయ్యేలా చర్య లు తీసుకోవాలన్నారు. మండలాల్లో అభివృద్ధి పనులను ఎంపీడీవోలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో సుందరి కిరణ్‌కుమార్, డీఎఫ్‌వో సతీష్‌కుమార్, సీపీ వో వెంకటేశ్వర్లు, జిల్లా సంక్షేమాధికారి పద్మ, డీఏవో రామారావునాయక్, డీపీవో యాదయ్య, పలు విభాగాల జిల్లా అధికారులు శంకర్, మోహన్‌బాబు, తిరుపతయ్య, మాధవరెడ్డి, డి. శ్రీనివాస్‌రావు, రవికుమార్, నాగేందర్, ఏవో సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అసంఘటిత రంగ కార్మికులు ఈ-శ్రమ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎస్ వెంకటరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసంఘటితరంగ కార్మికులు ప్రతి ఒక్కరూ ఈ-శ్రమ్ పథకంలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. పథకంలో పేరు నమోదు చేసుకున్న కార్మికులకు 12 అంకెలతో కూడిన ప్రత్యేక గుర్తింపు కార్డును అందజేస్తారని, ప్రమాదవశాత్తు కార్మికులు మృతి చెందితే ప్రభుత్వం రూ.2 లక్షల బీమా అందజేస్తుందన్నారు. జిల్లాలో 31 మార్చి 2022 వరకు మృతి చెందిన కార్మికుల కుటుంబసభ్యులు ప్రమాద బీమా పొందేందుకు ఈ-శ్రమ్ కార్డుతో పాటు అవసరమైన ధ్రువపత్రాలతో కలెక్టరేట్‌లోని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎఫ్ఎల్‌సీని పకడ్బందీగా నిర్వహించాలి

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ యంత్రాల తొలి దశ తనిఖీ(ఎఫ్ఎల్‌సీ)ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఎస్ వెంకటరావు అన్నారు. కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాంలో నిర్వహిస్తున్న ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను అదనపు కలెక్టర్లు ప్రియాంక, వెంకటరెడ్డితో కలిసి పరిశీలించి, మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలకు 13మంది ఈసీఎల్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో ఈనెల 14వతేదీవరకు 1,867 వీవీప్యాట్లు,2,811 బ్యాలెట్ యూనిట్లు, 1,747 కంట్రోల్ యూనిట్లకు ఎఫ్ఎల్‌సీ చేపడుతున్నట్లు తెలిపారు. ఎఫ్ఎల్‌సీ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు క్రిష్ణయ్య, సూర్యనారాయణ, జగదీశ్వర్ రెడ్డి, పార్టీల నాయకులు సవరాల సత్యనారాయణ, కోట గోపి, రమేష్, అబీద్ పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

సూర్యాపేట(కలెక్టరేట్), ఫిబ్రవరి 5 : గ్రామపంచాయతీల్లో నియమితులైన ప్రత్యేక అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంక అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామసభల తీర్మానం ద్వారా పనులు చేపట్టాలని, ప్రాధాన్య క్రమంలో అత్యవసర పనులు చేపట్టాలన్నారు. పంచాయతీల స్థిర,చర ఆస్తులకు నష్టం కలుగకుండా పరిరక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో డీపీవో యాదయ్య, పీడీ కిరణ్‌కుమార్, సాంబిరెడ్డి, శ్రీరాములు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని అదనపు కలెక్టర్ ప్రియాంక అన్నారు. జిల్లా కేంద్రంలో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బ్యూటీషియన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి, మాట్లాడారు. ప్రతీ మహిళా సాధికారత సాధించే దిశగా ముందుకు వెళ్లాలన్నారు. బ్యూటీషియన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి జ్యోతి పద్మ, కవిత, రేవతి, వినోద్, తేజస్విని, భవ్య తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ ఆసుపత్రికి మహర్దశ

- ఉత్తమ్ సమక్షంలో ఆరోగ్య శాఖ మంత్రి సమీక్ష రేపు
- హాజరవుతున్న మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- సిబ్బంది నియామకం, సేవల పెంపునకు అవకాశం

హుజూర్‌నగర్‌లోని 100 పడకల ఆసుపత్రికి మహర్దశ రానుంది. ఆసుపత్రిలో నెలకొన్నవైద్యుల కొరత, మౌలిక వసతుల లేమి, సేవల కోసం ఇతర అవసరాలపై రాష్ట్ర కేబినెట్‌లోని ముగ్గురు మంత్రులు ఈ నెల 7వ తేదీన సమీక్షించనున్నారు. ఆసుపత్రిలోనే నిర్వహించే కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

\- హుజూర్‌నగర్



ప్రస్తుతం ఆసుపత్రిలో వైద్యులు, మౌలిక వసతుల కొరతతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పేరుకే పెద్దాసుపత్రిగా ఉన్నా సౌకర్యాలు నాస్తి అన్న చందంగా తయారైంది. హుజూర్‌నగర్‌లోని ఏరియా ఆసుపత్రికి ప్రతి రోజూ 500 మందికి పైగా ఔట్ పేషెంట్లు, 50 మందికి పైగా ఇన్‌పేషెంట్లు వస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మంత్రి జగదీష్‌రెడ్డి మూడునాలుగు పర్యాయాలు ఈ ఆసుపత్రిలో సమీక్షలు చేసినా ఎలాంటి మార్పులుచేర్పులు కాలేదు. 2012లో అప్పటి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 50 పడకల ఆసుపత్రిని 100పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయించారు. అప్పటి సీఎం రోశ య్య ఈ ఆసుపత్రికి శంకుస్థాపన చేయగా ఏడాది కాలంలో భవనాలు నిర్మించారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ స్పీకర్‌గా ఉన్న నాదెండ్ల మనోహర్‌తో ప్రారంభింపజేశారు. ఆ తర్వాత 2014లో తెలంగాణ ఏర్పడిన అనంతరం కేసీఆర్ ప్రభుత్వం రాగా పదేళ్లలో ఆసుపత్రి ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు.

51 మంది 16 మంది వైద్యులు

ఏరియా ఆసుపత్రిలో మొత్తం 51 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 16 మంది మాత్రమే పనిచేస్తున్నారు. కీలకమైన డాక్టర్లు, ఎండీలు, సర్జన్లు, జనరల్ సర్జన్లు, జనరల్ ఫిజీషియన్లు ఆసుపత్రిలో అందుబాటులో లేరు. 35 వైద్యుల పోస్టులు ఖాళీగా ఉండడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గైనకాలజిస్టులు ఆరుగురికి ముగ్గురు, మత్తు డాక్టర్లు ఆరుగురికి ఆరుగురు ఉన్నారు. పిల్లల వైద్యులు ఆరుగురికి ముగ్గురు ఉన్నారు. రేడియాలజిస్టుల పోస్టులు 3 ఖాళీగా ఉన్నాయి. జనరల్ ఫిజీషియన్(ఎండీ) పోస్టులు 4 ఖాళీగా ఉన్నాయి. జనరల్ సర్జన్లు ఐదుగురికి ఒక్కరే ఉన్నారు. ఆర్థోపెడిక్ వైద్యులు ముగ్గురికి ఒక్కరే ఉన్నారు. నేత్ర వైద్యులు ముగ్గురికి ఒక్కరు, ఈఎన్‌టీ మూడు పోస్టులకు గాను ఒక్కరే ఉన్నారు. పెథాలజిస్టులు, మానసిక వైద్యులు, ఫోరెన్సిక్, చర్మసంబంధిత వైద్యులు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దంత వైద్య పోస్టులు రెండుకు ఒకటి ఖాళీగా ఉంది. చెస్ట్‌ఫిజీషియన్లు మూడింటికి రెండు ఖాళీగా ఉన్నాయి. అదేవిధంగా అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ పోస్ట్ సైతం ఖాళీగా ఉంది.

ముగ్గురు మంత్రులతో సమీక్ష

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, స్థానిక ఎమ్మెల్యే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రి కావడంతో పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆసుపత్రి అభివృద్ధిపై దృష్టి సారించారు. ఈ నెల 7వ తేదీ ఉదయం 11 గంటకు మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆసుపత్రిని సందర్శించనున్నారు. అనంతరం ఆసుపత్రిలో సిబ్బంది నియామకం, మౌలిక వసతులు ఇతర అంశాలపై సమీక్ష చేయనున్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు, రోగులకు అందిస్తున్న సేవలను సమీక్షించనున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ కాన్పులు చేయాలనే లక్ష్యంతో డాక్టర్లను ప్రోత్సహించనున్నారు.

100 పడకల ఆసుపత్రికి రేపు శంకుస్థాపన

కోదాడ రూరల్ : కోదాడ పట్టణంలో ప్రస్తుత 20 పడకల ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేస్తూ 100 పడకలకు విస్తరించనున్నారు. ఈ నెల 7వ తేదీన ఆ ఆసుపత్రి నిర్మాణం కోసం శంకుస్థాపన నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు హాజరవుతున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా స్థాయి వైద్యశాఖ అధికారులు హాజరవుతున్నట్లు కోదాడ వైద్యసిబ్బంది తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కుక్కర్ పేలి ఇద్దరు

చిన్నారులకు గాయాలు



వివరాలు 7లో

రోడ్డు భద్రత అందరి బాధ్యత: ఎస్పీ



జాతీయ రహదారి-65పై బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తిస్తున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే

మునగాల రూరల్, ఫిబ్రవరి 5 : రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా సోమవారం హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి(65)పై మునగాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్లాక్‌స్పాట్స్‌ను పరిశీలించారు. జాతీయ రహదారిపై మునగాల కేంద్రంతో పాటు మాధవరం, మొద్దులచెర్వు, కలకోవ, ముకుందాపురం, ఆకుపాముల బస్‌స్టాప్‌ల వద్ద రోడ్డు పరిస్థితులను ఆయన పరిశీలించారు. తరుచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసు అధికారులను,ఎన్‌హెచ్ఏఐ, జీఎంఆర్ అధికారులను ఆదేశించారు. జంక్షన్ల వద్ద ఇంజనీరింగ్ లోపాలు గుర్తించి, సవరించాలన్నారు. మునగాల మండల కేంద్రంలో స్థానికులతో మాట్లాడుతూ జాగ్రత్తలు పాటించాలని, రాంగ్ రూట్‌లో వాహనాలు నడపవద్దని, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామసభలు నిర్వహించి రోడ్డు భద్రతా నియమాలను వివరించాలన్నారు. ప్రమాదాల నివారణకు కృషి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో కోదాడ డీఎస్పీ ప్రకాష్, మునగాల సీఐ వీరరాఘవులు, ఎస్ఐ లోకేష్, జీఎంఆర్ అధికారులు రాజేంద్రకుమార్,నాగకృష్ణ పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో హరిహరులకు విశేష పూజలు



శివాలయంలో స్ఫటికమూర్తులకు హారతి నివేదిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 5: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో సోమవారం హరిహరులకు విశేష పూజలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. స్వయంభూ లక్ష్మీనారసింహుడికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో, అనుబంధ శివాలయంలో కొలువుదీరిన రామలింగేశ్వరుడికి, స్ఫటిక మూర్తులకు శైవాగమ పద్ధతిలో నిత్యవిధి కైంకర్యాలు నిర్వహించారు. ప్రభాతవేళ సుప్రభాతంతో లక్ష్మీనృసింహుడిని మేల్కొలిపిన పూజారులు గర్భాలయంలోని మూలమూర్తులకు, సువర్ణ ప్రతిష్టా అలంకారమూర్తులను వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసి తులసీదళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో లక్ష్మీనృసింహుడిని దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు విశ్వక్సేనుడికి తొలి పూజలతో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపైన శివాలయంలో పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరుడిని, ముఖమండపంలోని స్ఫటిక మూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల సహస్రనామ పఠనాలతో బిల్వపత్రార్చనలు నిర్వహించారు. సాయంత్రం వేళ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల అలంకార వెండి జోడు సేవలు, శివాలయంలో శివపార్వతుల ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాల ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి తిరువీధుల్లో సేవోత్సవం నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.34,02,176 ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

ఆధార్, రేషన్‌కార్డు అనుసంధానం చేయించుకోవాలి

చౌటుప్పల్ టౌన్, ఫిబ్రవరి 5: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలులో భాగంగా ఆధార్ కార్డు, రేషన్ కార్డు ల నంబర్లను గృహ విద్యుత్ సర్వీస్ నంబర్‌కు జత చేయవలసి ఉంటుందని చౌటుప్పల్ మండల ట్రాన్స్‌కో ఏఈ సతీష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహ విద్యుత్ సరఫరా బిల్లింగ్ కోసం ఇళ్ల వద్దకు వచ్చే ఆపరేటర్‌లు, లైన్‌మన్‌లకు ఆధార్ కార్డు, రేషన్ కార్డుల జిరాక్స్ కాపీలను అందజేసి, సహకరించాలని ఆయన కోరారు.

మాజీ ఎంపీపీ కవితకు మరో షోకాజ్ నోటీస్?

కోదాడ రూరల్, ఫిబ్రవరి 5: మాజీ ఎంపీపీ కవితకు కలెక్టర్ వెంకటరావు మరో షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు తెలిసింది. కోదాడ ఎంపీపీగా ఆమె బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో మండల పరిషత్‌కు సంబంధించిన రూ.40లక్షలు దుర్వినియోగం చేశారని ఎంపీటీసీలు, జడ్పీటీసీ కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. దీనిపై ఆయన కవితకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఈ నోటీస్‌కు కవిత స్పందించకపోవడంతో తిరిగి మండల పరిషత్ కార్యాలయానికి సోమవారం మరో నోటీస్ జారీ చేసినట్లు తెలిసింది.

నిందితుడికి ఆరు నెలల జైలు

కట్టంగూరు, ఫిబ్రవరి 5: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టిన ప్రమాదంలో బైకుపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తుల మృతికి కారణమైన కారు డ్రైవర్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ నకిరేకల్ మెజిస్ట్రేట్ షేక్ ఆరిఫ్ సోమవారం తీర్పు ఇచ్చినట్లు కట్టంగూరు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కేసుకు సంబంధించి ఏఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... 2015మే 20వ తేదీ సాయంత్రం 6.45 గంటల సమయంలో మండలంలోని పరడ గ్రామానికి చెంది మాగి భిక్షం, కోనేటి యాదయ్య, సుంకరబోయిన వెంకన్న ద్విచక్ర వాహనంపై నార్కట్‌పల్లి మండలం ఏపీలింగోటం నుంచి కట్టంగూర్‌కు వస్తున్నాడు. ఈ నేపథ్యంలో పావనగుండ్ల సబ్‌స్టేషన్ వద్ద హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న ఏపీ 10 ఏక్యూ 8912 నెంబర్ గల కారు అతివేగంగా, అతిజాగ్రత్తగా ముందుగా వెళ్తున్న బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న మాగి భిక్షం, కోనేటి యాదయ్య అక్కడికక్కడే మృతి చెందగా, సుంకరబోయిన వెంకన్నకు తీవ్ర గాయాలయ్యాయి. భిక్షం కుమారుడు ప్రకాష్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ విజయ్ ప్రకాష్ కేసు నమోదు చేసి చార్జిషీటు ఫైల్ చేశారు. సోమవారం రోజు నకిరేకల్ మెజిస్ట్రేట్ విచారణ జరిపి నేరం రుజువైనందున కారు డ్రైవర్ వడ్లపల్లి చిదానందకు ఆరు నెలల జైలుశిక్ష, రూ. 1000 జరిమానా విధించినట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

కూరెళ్ల విఠలాచార్యకు సన్మానం



విఠలాచార్యను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

రామన్నపేట, ఫిబ్రవరి 5: పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆచార్య కూరెళ్ల విఠలాచార్యను చౌటుప్పల్ మండల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కర్నాటి శంకరయ్య, కానుగుల వెంకటయ్య, భీమిడి మోహన్‌రెడ్డి, ముటుకుల్లోజు పాండురంగాచారి, సహాయ అధ్యక్షుడు చొల్లేటి రాజయ్య ఉన్నారు.

చికిత్సపొందుతూ కార్మికుడు మృతి

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 5: చికిత్సపొందుతూ కార్మికుడు మృతి చెందాడు. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. యూపీకి చెందిన రాంజీ బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లోని బోరబండలో ఉంటున్నాడు. భువనగిరి శివారులోని పగిడిపల్లి పరిధిలో సికింద్రాబాద్‌లోని మాణెపల్లి జువ్వెలర్స్ ఆధ్వర్యంలో బాలాజీ టెంపుల్ నిర్మిస్తున్నారు. ఆ టెంపుల్‌లో ఫ్లోరింగ్ వేసేందుకు రాంజీ అనే కూలీ జనవరి 26న కొలతలు తీస్తుండగా లిఫ్ట్ కోసం తీసిన గుంతలో జారి పడడంతో గాయాలయ్యాయి. గాంధీ ఆస్పత్రిలో తరలించగా చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు.

పంటలకు జీవం



కొనసాగుతున్న నీటి విడుదల

- మేజర్లకు కొనసాగుతున్న నీటి విడుదల
- ఊపిరి పోసుకుంటున్న ఎండుతున్న పొలాలు
- రైతుల్లో చిగురించిన ఆశలు



ఆయకట్టులో సాగు చేసిన పొలాలు

నిడమనూరు, ఫిబ్రవరి 5: నిడమనూరు మండలం నాగార్జునసాగర్ ఎడమ కాల్వ పరిధిలోని మేజర్ కాల్వలకు నీటి విడుదల కొనసాగుతోంది. ప్రధానకాల్వకు నీటి విడుదల కొనసాగుతున్నందున మేజర్ కాల్వలకు కూడా నీటిని విడుదల చేస్తున్నారు. ఆయకట్టు పరిధిలో సాగు చేసిన పొలాలు ఎండిపోతున్నందున రైతుల విజ్ఞప్తి మేరకు ముదిమాణిక్యం, నారెళ్లగూడెం మేజర్లకు ఆదివారం ఉదయం నుంచి ఎన్నెస్పీ అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. ఆయకట్టు పరిధిలో అనేక మంది రైతులు యాసంగిలో పంటలు సాగు చేశారు. నీటి ఎద్దడి, వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా కొందరు బోరుబావులు ఏర్పాటు చేసుకున్నారు. కానీ భూగర్భజలాలు రోజురోజుకు అడుగంటిపోతున్నందున అనేక చోట్ల పొలాలు నెర్రెలు బారి ఎండిపోతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పొలాలు కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాలోని పాలేరు రిజర్వాయర్ నింపేందుకు ప్రభుత్వం సాగర్ ప్రధానకాల్వకు ఇటీవల నీటిని విడుదల చేశారు. ఆయకట్టులో సాగు చేసిన పొలాలు తమ కళ్ల ముందే ఎండిపోతున్నా, పక్క జిల్లాలోని రిజర్వాయర్ నింపేందుకు మాత్రం నీటిని విడుదల చేయడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోయారు. దీంతో తమ పంటలు కాపాడుకునేందుకు నిడమనూరు, అడవిదేవులపల్లి, దామరచర్ల, త్రిపురారం మండలాలకు చెందిన పలువురు రైతులు ఇటీవల ముదిమాణిక్యం మేజర్ వద్ద నీటిని విడుదల చేసుకునేందుకు ప్రయత్నించారు. కానీ మేజర్లకు నీటి విడుదలకు అనుమతి లేదని అధికారులు రైతులను అడ్డుకున్నారు. రాత్రి సమయంలో రైతులు మేజర్ షట్టర్ ఎత్తి నీటిని విడుదల చేస్తారనే భయంతో అధికారులు, పోలీసులు మేజర్ వద్ద కాపలా కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

దీంతో రైతులు ఎండుతున్న పొలాల గురించి స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పంటల పరిస్థితి వివరించారు. దాంతో వారు ఎన్నెస్పీ ఉన్నతాధికారులతో మాట్లాడి మేజర్ కాల్వలకు నీటిని విడుదల చేసే విధంగా ఆదేశాలు ఇప్పించడంతో నీటి విడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం ముదిమాణిక్యం మేజర్‌కు 400 క్యూసెక్కులు, నారెళ్లగూడెం మేజర్‌కు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా మేజర్లకు ఎన్ని రోజులు నీటిని విడుదల చేస్తారనేది సరైన ఆదేశాలు రాలేదు. ప్రజా ప్రతినిధుల చొరవతో మేజర్ కాల్వలకు నీటిని విడుదల చేయడంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురించాయి. ఎండిపోతున్న పొలాలకు జీవం పోసినట్లయిందని రైతులు భావిస్తున్నారు. ప్రధానకాల్వకు మరో మూడు రోజులపాటు నీటి విడుదల కొనసాగనుంది. దీంతో మేజర్లకు సైతం నీటిని విడుదల చేసే అవకాశం ఉండవచ్చని రైతులు భావిస్తున్నారు.

ఎమ్మెల్యే జైవీర్ చొరవ వల్లే సాగు నీరు

ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి చొరవ తీసుకోవడం వల్లే మేజర్లకు సాగునీరు విడుదల అవుతోంది. ఆయకట్టులో యాసంగిలో సాగు చేసిన పొలాలు ఎండిపోతున్నందున తమ పరిస్థితి ఎమ్మెల్యేకు వివరించడంతో ఆయన స్పందించి ప్రభుత్వంతో మాట్లాడి కాల్వలకు నీటిని విడుదల చేయించారు. నీటి విడుదల తో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

– గడ్డం గోవిందరెడ్డి, రైతు, నారమ్మగూడెం

నారెళ్లగూడెం మేజర్‌కు 70 క్యూసెక్కుల నీరు

నారెళ్లగూడెం మేజర్ కాల్వ డిజైన్ డిశ్చార్జి ప్రకారం 80క్యూసెక్కులకు ప్రస్తుతం కాల్వకు 70క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నాం. ఎన్ని రోజులపాటు నీటిని విడుదల చేసే విషయం ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఉంటుంది. ప్రస్తుతానికి అయితే నీటి విడుదల కొనసాగుతుంది.

– ప్రవీణ్‌రాజు, ఏఈ

అనంతారంలో వ్యక్తి సజీవ దహనం

- హత్యా..? ఆత్మహత్యా..? అనే కోణంలో పోలీసుల దర్యాప్తు
- ద్విచక్రవాహనం సహా దహనమైన వ్యక్తి
- బైక్ నెంబర్ ఆధారంగా బంధువులకు సమాచారం
- యాదాద్రిభువనగిరి జిల్లాలో ఘటన



నాగరాజు (ఫైల్)

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 5: హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారి సమీపంలో యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని అనంతారం గ్రామ ఫ్లైఓవర్ కింద దారుణం జరిగింది. ద్విచక్ర వాహనం సహా ఓ వ్యక్తి సోమవారం దహన మై కన్పించాడు. గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి అతనిని హత్య చేసి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బైక్ నుంచి మంటలు వస్తుండ డంతో గమనించిన స్థానికులు వెంటనే భువనగిరి రూరల్ పోలీసులకు సమాచార మిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సంఘటన ప్రాంతంలో లభించిన సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనం నెంబర్ ఆధారంగా అతని ఆచూకీని కనుగొని బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన సూర నాగరాజు(39) తండ్రి పోచం 25సంవత్సరాల క్రితం మృతిచెందాడు. తల్లి లక్ష్మీ కూడా 16సంవత్సరాల క్రితం మృతిచెందింది. నాగరాజుకు సంబంధీకులు ఎవరూ లేకపోవడంతో 15సంవత్సరాల క్రితం కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్‌లోని ఫిలింనగర్ సమీప ంలోని ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటూ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అవివాహితుడైన నాగరాజు చిన్నప్పటి నుంచి మధుమేహం వ్యాధితో బాధపడు తున్నాడు. సోమవారం హైదరాబాద్ నుంచి బైక్‌పై వచ్చిన నాగరాజు అనంతారం గ్రామ ఫ్లైఓవర్ కింద సజీవ దహనమైన స్థితిలో విగతజీవిగా కనిపించాడు. స్థానికుల సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు నాగరాజు తాను వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను బైక్ మీద కూర్చొని ఒంటిపై పోసుకొని ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నామని పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలానికి మూడు కిలోమీటర్ల దూరంలో గల గూడూరు టోల్ ప్లాజా వద్ద సీసీ కెమెరాలు పరిశీలించగా బైక్‌పై అతడు ఒక్కడే వచ్చినట్లు రికార్డు అయిందని పోలీసులు తెలిపారు. అయినప్పటికీ ఘటనా స్థలంలో క్లూస్ టీం క్షుణ్ణంగా పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అనారోగ్య కారణాలతోనే ఆత్మహత్య చేసుకున్నాడని నాగరాజుకు వరుసకు సోదరుడైన రిటైర్డ్ తహసీల్దార్ ముల్కల సుభాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని వారికి అప్పగించినట్లు భువనగిరి రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో కృష్ణవేణికి గోల్డ్ మెడల్



మేళ్లచెర్వు, ఫిబ్రవరి 5: హైదరాబాద్‌లోని బాచుపల్లిలో ఈ నెల ఒకటో తేదీ నుంచి నిర్వహించిన కాసాని కౌసల్య ముదిరాజ్ మెమోరియల్ 49వ జూనియర్ నేషనల్ కబడ్డీ చాంపియన్‌షిప్-2024 పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో స్పోర్ట్స్ ఆఫ్ ఇండియా జట్టుకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రానికి చెందిన పసుపులేటి కృష్ణవేణి గోల్డ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీష్‌యాదవ్ మాట్లాడుతూ కృష్ణవేణి గోల్డ్ మెడల్ సాధించడం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ తనను ప్రోత్సహించిన కబడ్డీ రాష్ట్ర కమిటీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీష్‌యాదవ్, నామా నర్సింహారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

- నివాసగృహాలు, గెస్ట్‌హౌస్‌లపై కొరడా
- చర్యలు చేపట్టిన అధికారులు



సాగర్ హిల్‌కాలనీలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చివేస్తున్న అధికారులు

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 5: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో కృష్ణానది తీరంలో అక్రమ కట్టడాలపై అధికారులు కొరడా ఝుళిపించారు. కృష్ణానది తీరంలో సామాన్య ప్రజలతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములను ఆక్రమించి, నివాసగృహాలు, అతిథిగృహాలు నిర్మించుకుంటున్నారు. ఈ విషయంపై పలుమార్లు 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో స్పందించిన మునిసిపల్ అధికారులు అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్నారు. తాజాగా సోమవారం హిల్‌కాలనీలో విజయవిహార్ అతిథి గృహం వెనక వైపున నదీతీరంలో నిర్మించుకున్న ఓ బీఆర్‌ఎస్ నాయకుడి గెస్ట్‌హౌజ్‌ను మునిసిపల్ అధికారులు రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సహకారంతో కూల్చివేశారు. అలాగే పైలాన్‌కాలనీలో ఓ ప్రైవేట్ ఉద్యోగి నిర్మించుకున్న అక్రమ కట్టడాన్ని కూడా నేలమట్టం చేశారు. ఈ అక్రమకట్టడాలు అన్ని టీఎస్ బీపాస్ మునిసిపల్ యాక్ట్ 2019 ప్రకారం కూల్చివేస్తున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్ వీ రారెడ్డి తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని క మిషనర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ బీసన్న, ఎస్‌ఐ సంపత్, ఇన్‌చార్జి కమిషనర్ వీరారెడ్డి, రెవెన్యూ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చివేశారు

విజయవిహార్ వెనక వైపున ఉన్న స్థలంలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్మించుకున్న నివాసగృహాన్ని జీవో నంబర్ 59 ప్రకారం దరఖాస్తు కూడా చేసుకున్నాం. మునిసిపల్ అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే మరో రెండు రోజుల్లో గృహప్రవేశం ఉండగా కూల్చివేయడం ఎంతవరకు సమంజసం.

- అవుదొడ్డి కార్తీక్, బాధితుడు

మద్యానికి బానిసై ఆత్మహత్య

వలిగొండ, ఫిబ్రవరి 5: మద్యానికి బానిసై ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్‌ఐ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెల్వర్తి గ్రామానికి చెందిన వసల సతీష్‌కుమార్(24) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానివేయాలని కుటుంబసభ్యులు ఎంత చెప్పినా అతనిలో మార్పు కనబడలేదు. ఆదివారం సాయంత్రం పొలానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటికి రాలేదు. ఫోన్ చేసినా స్పందన లేదు. సోమవారం ఉదయం సతీష్‌కుమార్ తండ్రి బాలస్వామి పొలానికి వెళ్లగా అక్కడ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఆస్పత్రికి తరలించారు. సతీష్‌కుమార్‌కు భార్య భాగ్యరేఖ, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 5: బైక్, తుఫాన్ ఢీకొన్న సంఘటనలో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలో చోటుచేసుకుంది. జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన ఎం.శ్రీకాంత్ తన ద్విచక్ర వాహనంపై కొలనుపాకకు వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో ఆలేరు నుంచి సిద్ధిపేటకు వెళ్లే రహదారిలో ఆశ్రమం వద్దకు వస్తుండగా ఆలేరు నుంచి కొలనుపాక వైపు వెళ్తున్న తుఫాన్ వాహనం ఢీకొట్టింది. దీంతో శ్రీకాంత్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో అతడిని ఆలేరులోని ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బీబీనగర్, ఫిబ్రవరి 5: యాదాద్రి భువనగిరి జిల్లా బీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వలిగొండ మండలం కాంచనపల్లి గ్రామానికి చెందిన సాధు చంద్రశేఖర్‌రెడ్డి(23) హైదరాబాద్‌లో వాటర్ వాషింగ్ సెంటర్ నడుపుతున్నాడు. ఆదివారం స్వగ్రామం కాంచనపల్లికి వచ్చిన చంద్రశేఖర్‌రెడ్డి అదే రోజు రాత్రి టీఎస్ 30 హెచ్ 4040 నెంబర్ గల ద్విచక్రవాహనంపై హైదరాబాద్‌కు తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలో గూడూరు టోల్‌ప్లాజా వద్ద టీఎస్ 05యూడీ 4546 నెంబర్ గల లారీ వెనుక నుంచి వేగంగా ఢీకొట్టి పైనుంచి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో లారీ తల పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు సాధు విక్రమ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్‌గౌడ్ తెలిపారు.

బాలుడి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు జైలు

సూర్యాపేటలీగల్, ఫిబ్రవరి 5: బాలుడి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు సంవత్సరం జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జిల్లా జడ్జీ జి. రాజగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. కేసు వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణం బాలాజీనగర్‌కు చెందిన మాలోతు నాగేశ్వర్‌రావు కుమారుడు ఉపేందర్ 2016 అగస్టు ఏడో తేదీన కోదాడలో హేర్ కటింగ్ చేయించుకుని బైక్‌పై ఇంటికి వెళుతుండగా, అయ్యప్పస్వామి దేవాలయం వద్ద మిర్యాలగూడెం నుంచి కోదాడకు వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్లాడు. ఈ ప్రమాదంలో ఉపేందర్ అక్కడిక్కడే మరణించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కోదాడ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసును విచారించిన కోదాడ ప్రిన్సిపల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఏ.శ్రీదేవి 2019 డిసెంబరు నాలుగో తేదీన నిందితుడూన జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామానికి చెందిన అద్దంకి చినబాబుకు ఒక సంవత్సరం జైలు, రూ.1000జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. తీర్పును సమర్థిస్తూ జిల్లా కోర్టు సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది.

అంగన్‌వాడీలో కుక్కర్ పేలి చిన్నారులకు గాయాలు

అనంతగిరి, ఫిబ్రవరి 5: సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని శాంతినగర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో కుక్కర్ పేలి ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బంది సోమవారం పప్పు వండుతుండగా కుక్కర్ హఠాత్తుగా పేలింది. ఈ సమయంలో అంగన్‌వాడీ కేంద్రంలో 15మంది చిన్నారులు ఉండగా, నీలం అభినవ్, కరిశ తన్వీకి గాయాలయ్యాయి. తహసీల్దార్ రవికుమార్, అంగన్‌వాడీకేంద్రానికి వచ్చి చిన్నారులను కోదాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసి సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది. శాంతినగర్ గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ఒక కేంద్రంలో టీచర్ తన వ్యక్తిగత కారణాలతో ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఈ కేంద్రాన్ని మరో అంగన్‌వాడీ కేంద్రంలో కలిపి నిర్వహిస్తున్నారు.

భూ సమస్య పరిష్కారం కావడంలేదని మనస్తాపం

- ఆత్మహత్య చేసుకుందామని పురుగుమందు డబ్బాతో కలెక్టరేట్‌కు వచ్చిన మహిళ
- సూర్యాపేట కలెక్టరేట్‌లో ఘటన



పూలమ్మ నుంచి పురుగుమందు డబ్బా స్వాధీనం చేసుకున్న భద్రతా సిబ్బంది

సూర్యాపేట(కలెక్టరేట్), ఫిబ్రవరి 5: తన కుటుంబ సభ్యుల వ్యవసాయ భూమిని రెవెన్యూ అధికారులు మ్యూటేషన్ చేయనందుకు ఆమె మనస్తాపం చెందింది. ఆత్మహత్య చేసుకోవాలని పురుగు మందు డబ్బాతో సూర్యాపేట కలెక్టరేట్‌కు వచ్చింది. పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి పురుగు మందు డబ్బాను స్వాధీనం చేసుకుని ఆమెను కలెక్టర్ వద్దకు తీసుకు వెళ్లారు. బాధితురాలు సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం గుంపుల గ్రామానికి చెందిన నాతాల పూలమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఆమె తండ్రి సుంకిరెడ్డి నారాయణరెడ్డి పదేళ్ల క్రితం మరణించాడు. నారాయణరెడ్డి పేరిట చివ్వెంల రెవెన్యూ శివారులో పలు సర్వే నెంబర్లలో మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని తల్లి సుశీలమ్మ పేరున మ్యూటేషన్ చేయాలని ఏడాది క్రితం మీసేవా ద్వారా పూలమ్మ దరఖాస్తు చేసింది. కాగా ఆన్‌లైన్‌లో సంబంధిత భూమి నెంబర్లకు డేటా కనెక్షన్ లింక్ అయింది. దానిని తొలగించి మ్యూటేషన్ చేయాలని రెవెన్యూ అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని పూలమ్మ ఆరోపించింది. తల్లి సుశీలమ్మకు వయస్సు పైబడుతున్నందున చేసేదిలేక, కలెక్టరేట్‌లో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకోవాలని భావించింది. పురుగు మందు డబ్బా తీసుకుని కలెక్టరేట్‌కు వచ్చింది. కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులు పూలమ్మ సంచిని తనిఖీ చేయగా పురుగు మందు డబ్బా కనిపించింది. వెంటనే ఆమె వద్ద ఉన్న పురుగు మందు డబ్బాను స్వాధీనం చేసుకుని పూలమ్మను కలెక్టర్ వద్దకు తీసుకెళ్లారు. ఆమె దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ వెంకట్రావ్ సమగ్ర విచారణ చేసి సమస్యను పరిష్కరించాలని సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

సమస్యలు పరిష్కరించాలని సీఎంకు విద్యార్థుల పోస్ట్‌కార్డు



పోస్టుకార్డులు చూపుతున్న విద్యార్థులు

తిప్పర్తి, ఫిబ్రవరి 5 : తమ పాఠశాలలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యార్థులు సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం పోస్టు కార్డులు రాశారు. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల పరిధిలోని మామిడాల జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని, నాలుగు ఏళ్లుగా సైన్స్ ఉపాధ్యాయులు లేక చదువుల్లో వెనుకబడుతున్నామని పేర్కొన్నారు. పాఠశాలలో బాలికల మూత్రశాలలకు పై కప్పులేని ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నామని పేర్కొంటూ సీఎం రేవంత్‌రెడ్డికి పోస్ట్ కార్డులు రాసి పంపించారు. ఈ సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరించాలని వారు కోరారు. పాఠశాలలోని సమస్యలను గుర్తించి విద్యార్థులు సీఎంకు లేఖ రాడం అభినందనీయమని ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే మందుల సామేల్

తుంగతుర్తి, ఫిబ్రవరి 5: తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో 100పడకల ఆస్పత్రి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే తుంగతుర్తి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలందరికీ విద్య, వైద్యం, సాగునీరు, రవాణా కల్పించడంలో ముందుంటుందన్నారు. త్వరితగతిన భవనాన్ని పూర్తి చేసి మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందించాలని అధికారులను ఆదేశించారు. మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంపై పూర్తి అవగాహన ఉందని సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ గుజ్జ దీపిక, డీఎంహెచ్‌వో కోటాచలం, వైద్య విధాన పరిషత్ అధికారి వెంకటేశ్వర్లు, ఆస్పత్రి సూపరింటెండెంట్ నిర్మల్‌కుమార్, ఎంపీపీ గుండగాని కవిత రాములుగౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, ఎంపీడీవో భీమ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటా

తిరుమలగిరి: కాంగ్రెస్ కార్యకర్తలకు అన్నివేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమలగిరిలో ఈ నెల ఏడో తేదీ నిర్వహించే కాంగ్రెస్ విజయోత్సవ సభ గురించి పలు సూచనలు చేశారు. ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్సోజు నరేష్, పట్టణ అధ్యక్షుడు పేరాల వీరేష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్, జుమ్మీలాల్, పాలకుర్తి రాజయ్య, మూల అశోక్‌రెడ్డి, దుంపల కృష్ణారెడ్డి, సుంకరి జనార్దన్, కందుకూరి లక్ష్మయ్యపాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఎమ్మెల్యే సామేల్‌ను తిరుమలగిరిలో మండల నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంపాల భిక్షం, రాంమూర్తి, రాజు, రవి, రాజు, ఈశ్వర్, బుచ్చిబాబు, సోమయ్య, పుల్లయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



తుంగతుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్, పక్కన జడ్పీ చైర్మన్ దీపిక

దేవాలయ అభివృద్ధి పనులకు భక్తుడి చేయూత



అర్వపల్లి ఆలయంలో పనులు చేయిస్తున్న భక్తుడు

అర్వపల్లి, ఫిబ్రవరి 5: మండల కేంద్రంలోని యోగానందలక్ష్మీ నర్సింహస్వామి దేవాలయంలో అభివృద్ధి పనులకు భక్తుడు చేయూతనందిస్తు న్నారు. దేవాలయం చుట్టూ ప్రదక్షణల కోసం రూ.4లక్షలతో సీసీ రోడ్డు పనులకు సూర్యాపేట మండలం యర్కారం గ్రామానికి చెందిన భక్తుడు మొరిశెట్టి లక్షాది ముందుకు వచ్చారు. దేవాలయ ప్రాంగణంలో ఎక్స్‌కవేటర్‌తో సీసీ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్షాది మాట్లాడుతూ గత ఏడాది స్వామి వారిని దర్శించుకుని మొక్కుకున్నాని, మరో రెండు వారాల్లో నిర్వహించే ఆలయ బ్రహ్మోత్సవాల వరకు పనులను పూర్తి చేయిస్తానన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

నూతనకల్, ఫిబ్రవరి 5: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు కాంగ్రెస్ కార్యకర్తలు తగిన బుద్ధిచెబుతారని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పసుల అశోక్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్క సుమన్ వ్యాఖ్యలను ప్రజాస్వామ్యవాదులు, మేధావులు ఖండించాలన్నారు. సమావేశంలో ఇరుగు కిరణ్, గంగయ్య, బద్రి, నాగయ్య, మల్లయ్య, వెంకన్న, యాదగిరి పాల్గొన్నారు.

దశరథ మెమోరియల్ ఫౌండేషన్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

సూర్యాపేటఅర్బన్, ఫిబ్రవరి 5: దశరథ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభ పరీక్షల్లో జిల్లా కేంద్రంలోని న్యూమిలీనియం పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి భానుచందర్‌నాయక్ ప్రథమ స్థానం సాధించాడని పాఠశాల కరస్పాండెంట్ బాల్తు లక్ష్మీశ్రీనివాస్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర పాఠశాలలో దశరథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భానుచందర్‌నాయక్‌కు బహుమతి అందజేశారు.

హైదరాబాద్ కాకతీయ హైస్కూల్ విద్యార్థులకు ర్యాంకులు

ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ ఆధ్వర్యంలో జరిగిన గంగాదరినిధి మాథ్స్‌లో జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ కాకతీయ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించారని పాఠశాల కరస్పాండెంట్ కొండ సంతోష్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విదార్థులు దేదివ్య, సాత్విక్‌గౌడ్‌ను పాఠశాల డైరెక్టర్ రామకృష్ణ అభినందించారు.

విద్యార్థినీవిద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 5: విద్యార్థినీ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నారపరెడ్డి అన్నారు. 11వ నేషనల్ కరాటే చాంపియన్ షిప్ పోటీలు ఖమ్మం జిల్లా వీఎం బంజారా సప్తపది గార్డెన్‌లో ఆదివారం జరిగాయి. ఆ పోటీల్లో జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని గరిడేపల్లి గౌతమి గోల్డు మెడల్, స్పారింగ్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించింది. సోమవారం పాఠశాలను గౌతమిని, కరాటే మాస్టర్ సుల్తాని వెంకటేశ్వర్లు పాఠశాల ఉపాధ్యాయినీఉపాధ్యాయులు అభినందించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఆత్మకూర్(ఎస్), ఫిబ్రవరి 5: మండల కేంద్రానికి చెందిన రావుల లింగయ్య ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో ఇటీవల మృతి చెందాడు. ఆయనతో కలిసి చదువుకున్న స్నేహితులు లింగయ్య కుటుంబానికి సోమవారం రూ.42 వేలు, క్వింటా బియ్యం అందజేశారు. లింగయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారుప. కార్యక్రమంలో ములకలపల్లి విజయనిర్మల, రావుల సంజీవ, ఎస్‌కే ఫక్రుద్దీన్, పరికపెల్లి రమేష్, గడ్డం నర్సిరెడ్డి, వాంగుడోతు లింగానాయక్, సిరికొండ సురేష్, రమణాచారి, పెండెం కృష్ణ, పెండెం సోమలింగం, ఎండీ ఇబ్రహీం, షైల మోహన్, చంద్రమోహన్, చిత్తలూరి మల్లయ్య, ఉప్పలయ్య, రాజా మహ్మద్ పాల్గొన్నారు.

'గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి'

మఠంపల్లి, ఫిబ్రవరి 5: మండలంలోని గుర్రంబోడుతండాలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం బి.వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు కలెక్టర్ వెంకట్రావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందరర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ 100మంది విద్యార్థులు ఉంటే 258 మంది ఉన్నట్లు రికార్డులో రాసి అవినీతికి పాల్పడుతున్నాడని, ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారని తెలిపారు. కలెక్టర్‌కు గత నెల జనవరి ఎనిమిదో తేదీన ఫిర్యాదు చేయగా, విచారణ చేయాలని డీటీడీవోను కలెక్టర్ అదేశించారన్నారు. ఆ అధికారి తుతూమంత్రంగా విచారణ చేశారన్నారు. మోను కూడా పాటించడం లేదని తెలిపారు. తన కుటుంబ సభ్యులను, బంధువులను సిబ్బందిగా హెచ్‌ఎం నియమించుకున్నారని ఆరోపించారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లుపై విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రామానికి చెందిన అజ్మీర భద్రునాయక్, రమావత్ మురహరి తదితరులు ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి



సూర్యాపేటలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సూర్యాపేట(కలెక్టరేట్), ఫిబ్రవరి 5: మాజీ సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత మరిచి మాట్లాడుతున్నారన్నారని ఆరోపించారు. కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదన్నారు. బీఆర్ఎస్ పాలనలో లక్షలాది ఎకరాలు సాగులోకి వచ్చాయన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక లేనిపోని విమర్శలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ పుట్టా కిశోర్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సవరాల సత్యనారాయణ, బూర బాలసైదులుగౌడ్, నాయకులు డొంగరి యుగేంధర్, ఆకుల లవకుశ, భరత్, బత్తుల జాని, రమేష్, కక్కిరేణి నాగయ్యగౌడ్, అంజమ్మ, కరుణశ్రీ, సోమగాని వేణుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ఖమ్మంపాటి రేణుబాబు, ఏడుకొండల్, వేణుగోపాల్‌రెడ్డి, రఫీ, మహేశ్వరి, జానకిరాములు, నరేందర్, శంకర్ పాల్గొన్నారు.

కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

తుంగతుర్తి: కేసీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, సీఎంగా రాష్ట్ర అభివృద్ధికి పదేళ్ల పాటు అహర్నిశలూ కృషి చేసినే కేసీఆర్‌ను విమర్శించడం తగదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుడిపాటి సైదులు, మల్లెపాక వెంకన్న, గోపగోని రమేష్, వెంకటనారాయణ, సత్యం, వెంకన్న, ఉప్పలయ్య, మనోజ్ పాల్గొన్నారు.

రైతు బాంధవుడు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



అనంతగిరిలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి దంపతుల ఫ్లెక్సీకి క్షీరాభికం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అనంతగిరి, ఫిబ్రవరి 5: ఇచ్చిన హామీని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిలబెట్టుకుని రైతు బాంధవుడు అయ్యారని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున, సాగర్ ఎడమ కాల్వ మాజీ చైర్మన్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామ శివారులోని ఎత్తిపోతల పథకం మరమ్మతులకు రూ.5.30కోట్లు మంజూరు చేయించడంతో సోమవారం మండలం కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, పద్మావతిదంపతుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ చుండూరు వెంకటేశ్వరరావు, కోదాడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునకుల గోపాల్‌రెడ్డి, బుర్రా సుధారాణిపుల్లారెడ్డి, వైస్ ఎంపీపీ రామ, ఎంపీటీసీ అనూష, కొండపల్లి వాసు, రవినాయక్, బాబునాయక్, నాగుల్ మీరా, వినయ్, నరసింహారెడ్డి, డేగ కొండయ్య, ఈదుల కృష్ణయ్య, వెంకటరెడ్డి, సైదులు, ఖాజాబీ, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి పలు గ్రామాల రైతుల ధన్యవాదాలు

గరిడేపల్లి: తాగు నీటి అవసరాల కోసం వేములూరు ప్రాజెక్ట్, జాన్‌పహాడ్ మేజర్లకు సాగర్ నీటిని విడుదల చేయించినందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని గానుగుబండ, కొండాయిగూడెం, మఠంపల్లి మండలంలోని హనుమంతులగూడెం గ్రామాల రైతులు కలిసి ధన్యవాదాలు తెలిపారు. తాగునీటి ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా, వెంటనే స్పందించినందుకు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జాన్‌పహాడ్ మేజర్ డీసీ మాజీ చైర్మన్ కందుల కోటిరెడ్డి, రైతులు గుర్రం వెంకటరెడ్డి, ఆది నారాయణరెడ్డి, సైదిరెడ్డి, నర్సింహారెడ్డి, మట్టారెడ్డి, వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు .

అక్రమ అరెస్టులు సరికాదు: సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా

సూర్యాపేటటౌన్, ఫిబ్రవరి 5: జాతీయ మహాసభల వాల్ రైటింగ్, ప్రచారం చేస్తున్న నాయకులను ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అక్రమంగా అరెస్టు చేయించడం సరికాదని సీపీఐ(ఎంఎల్)ప్రజా పంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రైతుబజార్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఖమ్మం సీపీ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. ప్రజల కోసం పనిచేసే నాయకులను రౌడీలుగా ముద్రవేయడం హేయమైన చర్యని అన్నారు. సీపీ ఒక అధికారిగా కాకుండా ఆర్ఎస్ఎస్, బీజేపీ పక్షపాతిగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక, పేర్ల నాగయ్య, అరుణోదయ నర్సయ్య, రాంజీ, చంద్రకళ, సూరం రేణుక, జయమ్మ, రమేష్, సయ్యద్, బన్ని, జీవన్, శ్రీకాంత్, జయసుధ పాల్గొన్నారు.

తిరుమలగిరి: ఖమ్మం జిల్లా సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ఆ సంఘం డివిజన్ కార్యదర్శి ఎర్ర అఖిల్ డిమాండ్ చేశారు. తిరుమలగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా ఉద్యమకారులను రౌడీషీటర్లని ఖమ్మం పోలీస్ కమిషనర్ మాట్లాడటం తగదన్నారు. వెంటనే వాఖ్యలను ఉపసంహరించుకుని, కేసులను ఎత్తివేయాలన్నారు. కార్యక్రమంలో పేర్ల నాగయ్య, కందుకూరి కొండయ్య, నట్టు సత్తయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేటలో ఖమ్మం సీపీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ప్రజాపంథా నాయకులు

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం

మఠంపల్లి, ఫిబ్రవరి 2: ప్రసిద్ధ మట్టపల్లి క్షేత్రంలో సోమవారం లక్ష్మీనరసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన నిర్వహించారు. అనంతరం స్వామి వారికి మాంగల్యధారణ, తలంబ్రాలతోనిత్య కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం స్వామికి నీరాజనమంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణమాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకానికి లబ్ధిదారుల ఎంపిక

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 5: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ గృహజ్యోతి పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని హుజూర్‌నగర్ ట్రాన్స్‌కో డివిజనల్ ఇంజనీర్ వెంకటకృష్ణయ్య తెలిపారు. సోమవారం పట్టణంలోని డీఈ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు రేషన్‌కార్డు వివరాలను ప్రభుత్వం సేకరిస్తుందన్నారు. విద్యుత్ వినియోగదారులు అధికారులకు రేషన్‌కార్డు, సెల్‌నెంబర్ సమాచారం ఇవ్వాలని సూచించారు.సమావేశంలో ఏడీఏ సక్రూనాయక్, ఏఈ బూర రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం ఎంతో ప్రగతి

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 5: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 50రోజుల్లోనే రాష్ట్రం ఎంతో ప్రగతి సాధించిందని టీపీసీసీ కార్యదర్శి ఎండీ అజీజ్‌పాషా అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయాల్లో ఎంతో అనుభవం ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సాగునీటి రంగంపై పూర్తి అవగాహన ఉందన్నారు.

ఉపకార వేతనాల దరఖాస్తు గడువు పొడిగింపు

భానుపురి, సూర్యాపేట(కలెక్టరేట్), ఫిబ్రవరి 5: జిల్లాలోని ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న ఎస్సీ విద్యార్థులు 2023-24విద్యా సంవత్సరంలో పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి మార్చి 31వరకు గడువు పొడిగించారని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె.దయానందరాణి సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులు వారి అర్హతల ప్రకారం పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత విద్యాసంస్థలు బాధ్యత తీసుకుని దరఖాస్తు చేయించాలన్నారు. హార్డ్ కాపీలను సంబంధిత ధ్రువపత్రాలను జతపర్చి జిల్లా షెడ్యూల్డ్ కులాల అధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు.

కోదాడ ఇన్‌చార్జి ఏడీఏగా రాజగోపాల్

కోదాడ రూరల్, ఫిబ్రవరి 5: కోదాడ వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి ఏడీఏగా రాజగోపాల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏడీఏగా పనిచేసిన వాసు సస్పెండ్ కావడంతో ఆయన స్థానంలో నడిగూడెంలో వ్యవసాయాధికారి రాజగోపాల్‌కు ఇన్‌చార్జి ఏడీఏగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులకు సలహాలు, సూచనలు అందించడంలో తనవంతు కృషి చేస్తానన్నారు.

పాస్టర్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక

సూర్యాపేట అర్బన్, ఫిబ్రవరి 5: సూర్యాపేట పాస్టర్ ఫెలోషిప్ నూతన కమిటీని జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ చర్చిలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ శ్రావణ్‌కుమార్, గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ ప్రభుదాస్, మామిడి శ్యాంసన్, పౌల్, కేఎస్ సిల్వీ, మీసాల ప్రభుదాస్ పి.మరియన్న, జవహర్‌పాల్, లాజరస్, గౌరవ సలహాదారులుగా అగ్జాండర్, రాజారత్నం, పలస సంజీవ, రమేష్, కార్యవర్గ సభ్యులుగా దానియేల్, ఏసురత్నం, పీటర్‌బాబు, సాల్మాన్, లింగనాయక్, ఏసురాజు, ఇమ్మాన్యుయేల్, ప్రసన్నకుమార్, శ్యాంప్రసాద్, కన్వీనర్లుగా రవీందర్‌నాయక్, రాజారత్నం, వెంకటయ్య, పౌల్‌ను ఎన్నుకున్నారు.కార్యక్రమంలో జాకబ్, మామిడి శ్యాంసన్ పాల్గొన్నారు.

విద్యార్థులు పరీక్షల భయాన్ని వీడాలి

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 5: విద్యార్థులు పరీక్షల సమయంలో భయాన్ని వీడాలని ఇంపాక్ట్ ట్రైనర్ ఆశికుమార్ కోరారు. సోమవారం పట్టణంలోని గ్రీన్‌వుడ్ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు మోటివేషనల్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఆయన మాట్లాడారు.. పరీక్షల సమయంలో పాజిటివ్‌గా ఆలోచించాలన్నారు కార్యక్రమంలో కరస్పాండెంట్ టి.మర్రెడ్డి, డైరెక్టర్ సరితరెడ్డి, ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, కృష్ణారావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న ప్రాక్టికల్ పరీక్షలు

సూర్యాపేటఅర్బన్, ఫిబ్రవరి 5: జిల్లాలో నాలుగో రోజు సోమవారం ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో 42 పరీక్ష కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అదేవిధంగా మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించారు. ఉదయం జనరల్ విభాగంలో 348 విద్యార్థులకు 339మంది హాజరయ్యారు. తొమ్మిది గైర్హాజరయ్యారు. ఒకేషన్ విభాగంలో 244మంది విద్యార్థులకు 218 మంది హాజరయ్యారు. 26మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా మధ్యాహ్నం జనరల్ విభాగంలో 320 మంది విద్యార్థులకు 307 మంది హాజరయ్యారు. 13మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 320 మంది విద్యార్థులకు 280 మంది హాజరయ్యారు. 40మంది గైర్హాజరయ్యారని డీఐఈవో జానపాటి కృష్ణయ్య తెలిపారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి


ఆత్మకూర్(ఎస్), పెన్‌పహాడ్, మఠంపల్లి, మేళ్లచెర్వు, సూర్యాపేట కలెక్టరేట్, ఫిబ్రవరి 5: ఈ నెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించే అఖిల భారత కార్మిక, రైతుల సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యుడు సామ నర్సిరెడ్డి కోరారు.. సోమవారం మండలంలోని పాత సూర్యాపేటలో ఆయన మాట్లాడారు.

● పెన్‌పహాడ్ మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి సమ్మె నోటీసును మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ఎంఈవో నకిరేకంటి రవికి సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ అందజేశారు .కార్యక్రమంలో సరస్వతి, శ్రావణి, మానస,పాల్గొన్నారు.

● దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని వ్యకా.స. జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ రన్‌మియా పిలుపునిచ్చారు. అనంతరం సమ్మె నోటీసును ఎంపీడీవో జానకిరాములు, ఎంపీవో అంజనేయులుకు అందజేశారు. కార్యక్రమంలో పున్నయ్య, జీపీ కార్మికులు పాల్గొన్నారు.

● సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ మేళ్లచెర్వులో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు పట్టెపు సైదులు ఆధ్వర్యంలో సంతకాలను సేకరించారు. కార్యక్రమంలో ఖాసీం, సైదా, పాల్గొన్నారు.

● కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కుందించి కార్పోరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, ఎల్క సోమయ్య అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమాధికారి జ్యోతి పద్మ, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ మంజులకు సమ్మె నోటీసును అందించి మాట్లాడారు.



సూర్యాపేట అర్బన్: ఎన్‌జీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యువత కోసం నిర్వహించే స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాస రాంకుమార్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని అక్షర ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివరాలకు సెల్ నెం. 9441163949ను సంప్రదించాలన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: పట్టణంలోని రిటైర్డు ఉద్యోగుల సంఘ కార్యాలయంలో హుజూర్‌నగర్‌కు చెందిన రిటైర్డు ఉద్యోగి రేపూరి యాకోబ్ సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పేదల జీవితాల్లో యాకోబ్ వెలుగులు నింపాడన్నారు. కార్యక్రమంలో రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చెన్నా సోమయ్య, ఎంఎస్ఎన్ రాజు, చంద్రయ్య, వెంకటేశ్వర్లు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నేరేడుచర్ల: రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు కందిబండ వాసంతి, ఆర్య వైశ్య సంఘం మండలాధ్యక్షుడు రాచకొండ రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో మండలంలోని మేడారం గ్రామానికి చెందిన బీమన సైదమ్మ, ఏపూరి సీతమ్మకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం మేడారం గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రాచకొండ విజయలక్ష్మి, అంజయ్య, శ్రీనివాసరావు, అరుణకుమారి పాల్గొన్నారు.

గరిడేపల్లి: విద్యార్థులు చదువులో రాణించడంతో పాటు సామాజిక సేవను అవవర్చుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సాయిశ్వరి అన్నారు. మండలంలోని గడ్డిపల్లి మోడల్ స్కూల్లో విద్యార్థులతో పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి వీరబాబు పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: మహాశివరాత్రి పురస్కరించుకుని మండల కేంద్రంలోని శంభులింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా కొబ్బరికాయలు, లడ్డూప్రసాదాల విక్రయం, కొబ్బరి చిప్పల సేకరణ హక్కు కోసం ఆలయ ప్రాంగణంలో ఈ నెల 7వ తేదీన ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తామని ఆలయ కార్యదర్శి కొండారెడ్డి తెలిపారు.

కోదాడ: పట్టణంలో మార్చి 20వ తేదీన కోదండ రామాలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త నాగుబండి రంగా తెలిపారు. ఈ కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు లక్ష్మణ్‌రావు, నారాయణరావు, సత్య నారాయణ, చెన్నకేశవరావు, మధుసూదన్, శ్రీనివాసరావు, నర్సింహారావు, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

కోదాడ టౌన్: పట్టణంలోని అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుకు రోబోటిక్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ టి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ సాంకేతికతలో వస్తున్న మార్పులను విద్యార్థులు అవగాహన చేసుకుని సృజనాత్మకతతో కూడిన రోబోటిక్స్ తయారుచేయాలన్నారు.

కోదాడ రూరల్: ఎన్నికల హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని అడ్లూరు గ్రామంలో కాంగ్రెస్ సమావేశాన్ని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేపూరి వెంకటాచారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వెంకట్రాంరెడ్డి, అధ్యక్షుడిగా ఈపూరి సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రామాంజనేయులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు సీతారాంరెడ్డి, సర్పంచ్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

●జిల్లా వ్యాప్తంగా అర్హులైన గీత కార్మికులందరికీ లైసెన్సులు ఇప్పించేందుకు కృషి చేస్తానని కౌండిన్య గౌడ సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ కేఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. నూతన లైసెన్సుల కోసం కోదాడ మండలంలోని కొత్తఅడ్లూరు గ్రామంలో 30మంది గీతకార్మికులకు టాపింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గీతకార్మికులకు ఎక్స్‌గ్రేషియాను రాష్ట్ర ప్రభుత్వం రూ.10లక్షలకు పెంచనుందని, సేఫ్టీ మోకులను కూడా అందజేయనుందని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ సత్యనారాయణ, వీఎస్ రావు, యరగాని వెంకటేష్, ఉసిరికాయల వెంకటేశ్వర్లు, పెదప్రోలు కొండలు, నాగేషు పాల్గొన్నారు.

తిరుమలగిరి రూరల్: మండలంలోని తొండ గ్రామానికి చెందిన గన్నపురెడ్డి రవీందర్‌రెడ్డి కుమారుడు ఉషాకిరణ్‌కుమార్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్దిరాల: విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. మద్దిరాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో హెచ్‌ఎం వెంకటయ్య, ఉపాధ్యాయులు రమేష్, వెంకన్న పాల్గొన్నారు.

నూతనకల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని మండల నోడల్ అధికారి శివయ్య కోరారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించి ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడంతో పాటు చతుర్విధ ప్రక్రియలు వచ్చే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విద్యాసాగర్, ఉపాధ్యాయులు రేపాక లింగయ్య, రామాచారి, వెంకన్న పాల్గొన్నారు.

●నూతనకల్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఇమ్మారెడ్డి మల్లారెడ్డి తల్లి చొక్కమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె దశదిన కర్మకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు అన్నెపర్తి జ్ఞానసుందర్ హాజరై చొక్కమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పన్నాల మల్లారెడ్డి, చురికంటి చంద్రారెడ్డి, పసుల అశోక్‌యాదవ్, కట్టా మల్లారెడ్డి, గంగయ్య, కిరణ్, ఉపేందర్‌రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

అర్వపల్లి: పశువుల ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయాదవ్ అన్నారు. మండలంలోని కుంచమర్తి గ్రామంలో పశువుల ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. పశువులకు సకాలంలో టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అర్జున్, గోపాలమిత్ర శ్రీనివాస్, మన్నె నర్సయ్య, లింగయ్య, ఉగ్గం లింగరాజు, ఉగ్గం నాగరాజు, వీరసోములు పాల్గొన్నారు.